# భక్తులతో కిటకిటలాడిన శ్రీపాలపాటిదిన్నె ఆలయం



స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు



స్వామివారి దర్శనానికి క్యూలైన్‌లలో వేచి ఉన్న భక్తులు

**నల్లచెరువు, ఆగస్టు 17, ప్రభాతవార్త:**
మండల పరిధిలో ప్రసిద్ధిగాంఛిన శ్రీపాలపాటిదినె ్న ఆంజనేయస్వామి దేవస్థానం నందు శ్రావణమాసం సందర్భంగా రెండవ శనివారం ఆలయ ఈఓ సి.రవీంద్రరాజు, ఆలయ అర్చకులు ధనుంజయ, సాయి, రుశేంద్ర, దాస్‌లు భక్తిశ్రద్దలతో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, తమలపాకులతో ఆకు పూజలు, ప్రత్యేకపుష్పాలతో అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులు వివిధ ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారి దర్శనం కోసం క్యూలైన్‌లలో వేచి ఉండి స్వామివారిని దర్శించుకుని తీర్థ అన్నప్రసాదాలు సేవించారు. అనంతరం శ్రీ ఆంజనేయస్వామి మూలవిరాట్‌ను దేవస్థానం ప్రాంగణంలో ప్రాకారోత్సవం నిర్వహించడం జరిగింది.

## తృటిలో తప్పిన ప్రాణాపాయం



పిడుగు పడటంతో నష్టపోయిన వస్తువులు చూపుతున్న ఇంటి యజమానులు

**నల్లచెరువు, ఆగస్టు 17, ప్రభాతవార్త:**
మండల పరిధిలో శనివారం మధ్యాహ్నం కురిసిన ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం వల్ల మండల పరిధిలోని పాయలవాండ్లపల్లి గ్రామాలో దాసరి ఆంజినేయులు శ్యామలయ్య నివాస ఆవరణంలో పెంచుకుంటున్న వేప చెట్టు ( క్రింద పిడుగు పడటం జరిగింది. ఇంటి యజమాని తెలిపిన వివరాల మేరకు శ్రీపాలపాటిదిన్నె ఆంజనేయస్వామి దర్శనానికి వెళ్ళామని వర్షం రావడంతో అక్కడే ఉండి పోయామనీ, అంతలోనే మా ఇంటి నివాసంలో పెంచుకున్న చెట్టు పైన పిడుగుపాటు సంభవించిందని, ఇంటిలో విద్యుత్ వైర్లు, ఫ్రిడ్జ్,ఇంటిలోని ఎలక్ట్రిక్ సామాన్లు, ఇంటి ఆవరణంలో బట్టలు కూడా కాలిపోయాయన్నారు. ఇంటి పైకప్పు తీరు కూడా విరిగిందని, సుమారు రూ.లక్ష దాకా ఇంటిలో నష్టం వాటిలిందన్నారు. అదేవిధంగా గ్రామంలో పెద్ద శబ్దం రావడంతో గ్రామస్తులు ఆందోళనకు గురయ్యారనీ, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కూడా కాలిపోయిందని విద్యుత్ లైన్‌మెన్ తెలిపారు

## తలుపుల తహశిల్దార్‌గా రవినాయక్



**తలుపుల,ఆగష్టు17,ప్రభాతవార్త:**
తలుపుల తహశిల్దార్‌గా శనివారం రవినాయక్ బాధ్యతలు చేట్టారు.నంబుల పూలకుంట మండలంలో డిప్యూటి తహశజల్దార్‌గా విదులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో ఎటువంటి రెవెన్యూ సమస్యలు లేకుండా,ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలు పరిష్కరిస్తానని తెలిపారు.ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు.ఈ సందర్భంగా సిబ్బంది అభినందనలు తెలియచేశారు.

## 20 నుండి 24వ తేది వరకు ఆధార్ క్యాంప్‌లు

**నల్లచెరువు, ఆగష్టు 17, ప్రభాతవార్త:**




మండలంలోని అన్ని గ్రామ పంఛాయతీలలో గ్రామ ప్రజలకు ఎంపిడిఓ శకుంతల శనివారం ప్రకటన విడుదల చేశారు. ఆధార్‌కార్డుకు సంబంధించిన సేవలన్నీ బయోమెట్రిక్ ద్వారా ఆధార్‌కార్డు పొందవచ్చని, ఆధార్‌కార్డు అప్డేట్, ఐదు సంవత్సరాలు దాటిన పిల్లలకు బయోమెట్రిక్ ద్వారా ఆధార్‌కార్డు పొందవచ్చునని, పది సంవత్సరాలుపూర్తి ఆయన ప్రతి ఒక్కరికి డాక్యూమెంట్ అప్డేట్, బయోమెట్రిక్ చేసుకోవాలని, వివాహము అయిన వారికి అప్డేట్ అవసరమని, మొబైల్ లింక్, చిరునామా, పుట్టిన తేది కరెక్షన్స్ సర్వీసులు గ్రామ సచివాలయాలలో ప్రతి ఒక్క సేవలు అప్డేట్ చేసుకోవాలని తెలిపారు.

## గంగమ్మతల్లికి పూజలు నిర్వహించిన బిజెపి నాయకులు



పెన్నానదిలో పూజలు నిర్వహిస్తున్న బిజెపి నాయకులు

**తాడిపత్రిఅర్బన్, ఆగస్టు 17 ప్రభాతవార్త**
తాడిపత్రి ప్రాంతంలో శుక్రవారం కురిసిన భారీ వర్షానికి పెన్నానదికి భారీ ఎత్తున నీరు చేరింది. దీంతో భారతీయ జనతాపార్టీ పట్టణాధ్యక్షులు మైదుకూరు ఆంజనేయులు ఆధ్వర్యంలో శనివారం పెన్నానదిలో గంగమ్మకు పపుసు, కుంకుమ సమర్పించి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి తాడిపత్రి నియోజకవర్గం కన్వీనర్ చవ్వా రంగనాథరెడ్డి, ఎస్‌సి మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు మందాల శివ, ఓబిసి మోర్చా జిల్లా నాయకులు రంగనాయకులు, కిసాన్‌మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి బాలకంబగిరి, నాగేశ్వరరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అనుమానాస్పదస్థితిలో మహిళ మృతి

**పుట్లూరు, ఆగస్టు 17 ప్రభాతవార్త**
మండలంలోని మడ్డిపల్లి గ్రామానికి చెందిన జయలక్ష్మమ్మ (40) అనే మహిళ శనివారం ఉదయం అనుమానాస్పదస్థితిలో మృతి చెందింది. ఇంటి ముందుర కొట్టలో ఆమె నుదుటిపై రక్తగాయమై మృతి చెంది కనిపించింది. ఐతే ప్రమాదవశాత్తు కొట్టములో ఉన్న సిమెంట్ ఇటుకపిల్లర్ పడి మృతి చెందిందా లేక ఇతర కారణాల వల్ల మృతి చెందిందా అన్న అనుమానంపై భర్త శ్రీనివాసులరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



మృతి చెందిన జయలక్ష్మమ్మ

## ఘనంగా పల్లె ఉమా జయంతి వేడుకలు



కేక్ కట్ చేస్తున్న దృశ్యం



నిత్యావరసరుకులు అందచేస్తున్న దృశ్యం

**అమడగూరు, ఆగస్టు 17 ప్రభాతవార్త**
అమడగూరు మండల కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం తేదేపా మండల కన్వీనర్ గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి సతీమణి పల్లె ఉమా 62వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె ఉమాకు అమడగూరు మండలం అంటే ఎంతో అభిమానమన్నారు. ఏ ఎన్నికలు నిర్వహించినా ముందుగా ఆమె అమడగూరు మండల కేంద్రంలో వెలసిన శ్రీచౌడేశ్వరిదేవికి పూజలు నిర్వహించి ప్రచారం నిర్వహించేవారన్నారు. ఆమె ఆశీస్సులు పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, పుట్టపర్తి నియోజకవర్గం ప్రజలపై ఎల్లప్పుడూ వుండాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం గాజులపల్లి వద్ద వున్న శ్రీమాతృశ్రీ వృద్ధాశ్రమానికి నిత్యావసరసరుకులు అందచేశారు. అదేవిధంగా అమడగూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పాలు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్‌టి సెల్ అధికారి ప్రతినిధి కాలేనాయక్, మార్కెట్‌యార్డుమాజీచైర్మన్ కృష్ణమూర్తి, సీనియర్ నాయకులు కృష్ణారెడ్డి, రాజారెడ్డి, రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి టైలర్ రమణ, సుధాకర్‌రెడ్డి, వడ్డెర సంఘం అధ్యక్షులు కిష్టప్ప, రామచంద్ర, సంజప్ప, బోడెప్ప, ఫోటో స్టూడియో మూర్తి, టైలర్ రామాంజులు, రంగ, ఈశ్వర్‌రెడ్డి, తిరుపాల్, చలమయ్య, కళ్యాణ్‌రెడ్డి, దొడ్డమ్ అశోక్, డీలర్లు గాయత్రి, గంగరాజు, మోహన్, భాస్కర్‌రెడ్డి, లక్ష్మీనర్సి రెడ్డి, అబ్దుల్‌రవూఫ్, రెడ్డప్ప, కెవి రమణ, ఆదెప్ప, రామకృష్ణ, మూర్తి, తేదేపా నాయకులు, కార్యకర్తలు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే అడుగుజాడల్లోనే సేవా కార్యక్రమాలు



సరుకులు అందచేస్తున్న సోమశేఖర్‌నాయుడు

**తాడిపత్రిఅర్బన్, ఆగస్టు 17 ప్రభాతవార్త**
ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి మనోభావాలకు అనుగుణంగా ఆయన అడుగుజాడల్లోనే సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నట్లు టిఎన్‌టియుసి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సోమశేఖర్‌నాయుడు తెలిపారు. శనివారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి పట్టణ సమీపంలోని ఆర్డీటి కాలనీలోని పలువురి నివాసాల్లోకి వర్షం నీరు చేరింది. దీంతో ఇళ్లలోని నిత్యావసరసరుకులు నీట మునిగి తడిసిపోయాయి. దీంతో బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా బియ్యం, కందిబేడలు, చక్కెర, గోధుమపిండి పంపిణీ చేసినట్లు సోమశేఖర్‌నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిమి చంద్రకళ, డిష్ గౌస్, జూటూరు హాజీవలి, అబ్దుల్, కాశీం, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీఆంజనేయస్వామికి 4 కిలోల వెండి వాలం వితరణ

**యల్లనూరు, ఆగస్టు 17 ప్రభాతవార్త**



మండల కేంద్రంలోని కోటవీధిలో వెలసిన శ్రీఆంజనేయ స్వామికి 4 కిలోల వెండి వాలాన్ని వితరణ చేశారు. శ్రావణమాసం రెండవ శనివారం పురస్కరించుకుని విడపనకల్లు గ్రామానికి చెందిన పెనికలపాటి రామాంజినేయులు, లలితమ్మ దంపతులు ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుని వెండి వాలాన్ని వితరణ చేసి స్వామివారికి ఆకుపూజ కట్టించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

శ్రీఆంజనేయస్వామికి పూజలు నిర్వహించిన ← దృశ్యం

# కురిసిన వాన..మురిసిన రైతన్న

- పుట్లూరు మండల వ్యాప్తంగా 138.8 మి.మీ వర్షపాతం - పలుచోట్ల నీట మునిగిన పంటలు, కూలిన ఇళ్లు



వర్షానికి కూలిన ఇళ్లు



ప్రవహిస్తున్న వాగులు

**పుట్లూరు, ఆగస్టు 17 ప్రభాతవార్త**
ఎన్నో నెలలుగా జాడలేని వరుణదేవుడు కరుణ చూపాడు. దీంతో రైతన్నలు ఆనందంతో విత్తనానికి సన్నద్ధమతువుతున్నారు. తీవ్ర కరువుతో కనీసం గుక్కెడు నీటి కోసం ప్రయాసలు పడుతుండడంతో వరుణదేవా కరుణించి కాపడవయ్యా అని ప్రజలు పూజలు, అఖండలం, భజనలు, బొడ్రాయికి 101 బిందెలతో అభిషేకం, తదితర పూజలు నిర్వహించిన నేపథ్యంలో శుక్రవారం రాత్రి మండలంలోని భారీ వర్షం కురిసి వంకలు, వాగులు ఏకమై పారుగుతున్నాయి. మండల వ్యాప్తంగా 138.8 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో పలుచోట్ల కుంటలు, చెరువులు వర్షం నీటితో నిండుకుండలా వున్నాయి. అరకటవేముల, వెల్లుట్ల, రామలింగాయపల్లి, గాండ్లపాడు, గూడూరు గ్రామాల్లో పంటలు నీటిలో మునిగిపోయాయి. అంతేకాకుండా చింతకుంట గ్రామంలో రెండు ఇళ్లు కూలిపోయాయి. భూగర్భజలాలు అడుగంటి బోరుబావులు సైతం ఎండిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి బోరుబావుల్లో నీరు పెరిగే అవకాశం వుంటుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## వృద్ధులకు దుస్తులు పంపిణీ



వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

**యాడికి, ఆగస్టు 17 ప్రభాతవార్త**
మండలంలోని లీలావతి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు శనివారం దుస్తులు పంపిణీ చేశారు. బోగాలకట్టకు చెందిన కుమ్మెత నాగిరెడ్డి 4వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన భార్య, కుమారులు ఆశ్రమంలోని వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. తండ్రి వర్ధంతిని పురస్కరించుకుని కుమారుడు కుమ్మెత నాగేశ్వర్‌రెడ్డి ప్రతి ఏటా వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్నారు. ఈ సందర్భంగా వృద్ధులు వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు నారాయణరెడ్డి, మోటుపల్లి రవికాంత్, ఆశ్రమ నిర్వాహకురాలు కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

## జూనియర్ మహిళా డాక్టర్ అత్యాచారం ఘటనపై కొవ్వొత్తుల ర్యాలీ




ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది, ప్రజలు

**యాడికి, ఆగస్టు 17 ప్రభాతవార్త**
కలకత్తా ఆర్ కేర్ ఆసుపత్రిలో శిక్షణ పొందుతున్న జూనియర్ మహిళా డాక్టర్‌పై అత్యాచారానికి నిరసనగా యాడికి, రాయలచెరువులో శనివారం ప్రభుత్వ వైద్యసిబ్బంది కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి దోషులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

## కాలనీలో పర్యటించిన తహశీల్దార్



కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న తహశీల్దార్

**యల్లనూరు, ఆగస్టు 17 ప్రభాతవార్త**
మండలంలోని తిమ్మంపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి హరిజనవాడకాలనీలో వర్షంనీరు ఎక్కువగా చేరింది. దీంతో దాదాపు 10 గృహాల వారు చాలా ఇబ్బందులు పడుతుంటే తహశీల్దార్ నాగరాజు అక్కడికి వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరించారు. తహశీల్దార్ మాట్లాడుతూ ఈ కాలనీవారికి ఇబ్బందులు లేకుండా 45 మీటర్ల రోడ్డు ఎన్ఆర్‌జిఎస్ కింద ప్రపోజల్ పెట్టి సిసి రోడ్డు మంజూరు కాగానే రోడ్డు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

## బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా ర్యాలీ




ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

**తాడిపత్రిఅర్బన్, ఆగస్టు 17 ప్రభాతవార్త**
బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులు, అరాచకాలకు నిరసనగా శనివారం హిందూ చైతన్యవేదిక ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ గాంధీకట్ట నుండి పోలీసుస్టేషన్ మీదుగా సిబి రోడ్డు, వాల్మీకి సర్కిల్, ఎన్‌టిఆర్ సర్కిల్, పూలే సర్కిల్ మీదుగా అంబేద్కర్ సర్కిల్ వరకు సాగింది. ఈ కార్యక్రమంలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు, అధ్యాపకులు, హిందూ (ఆర్ఎస్ఎస్, విహెచ్‌పి, బిజెపి) సంఘాల నాయకులు, హిందూప్రేమికులు, పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## జూనియర్ వైద్యురాలిపై అత్యాచారానికి పాల్పడిన వారిని శిక్షించాలి



నిరసన తెలుపుతున్న దృశ్యం

**పుట్లూరు, ఆగస్టు 17 ప్రభాతవార్త**
కలకత్తాలో జూనియర్ వైద్యురాలిపై అత్యాచారానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యురాలు డాక్టర్ హిమబిందు పేర్కొన్నారు. వైద్యురాలిపై అత్యాచారానికి నిరసనగా మండల కేంద్రంలో శనివారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీజిహేశ్వర్ మహారాజ్ జయంతి వేడుకలు



పూజల్లో పాల్గొన్న దృశ్యం

**తాడిపత్రిఅర్బన్, ఆగస్టు 17 ప్రభాతవార్త**
పట్టణంలోని అంబాభవానిదేవాలయంలో శ్రీజిహేశ్వర్ మహారాజ్ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా శ్రీజిహేశ్వర్ మహారాజ్ చిత్రపటాన్ని పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఇందులో భాగంగా శ్రీజిహేశ్వర్ మహారాజ్‌కు జై, శ్రీఅంబాభవానిమాతకు జై అంటూ స్వకులసాలి సమాజం సభ్యులు నినాదాలు చేశారు. అదేవిధంగా 10వతరగతి, ఇంటర్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. అనంతరం హాజరైన వారికి విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో స్వకులసాలి సమాజం రాష్ట్ర అధ్యక్షులు కాంబ్లె నగేష్, తాడిపత్రి స్వకులసాలి సమాజం అధ్యక్షులు చంద్రశేఖర్, జిందె సురేష్, మహిళా మండలి అధ్యక్షురాలు మంజుల వాణి, శారదాబాయి, తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన వారిపై చర్య తీసుకోవాలి

- ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి

**కదిరి, ఆగస్టు 17, ప్రభాతవార్త**
నల్లమాడ మండలంలోని కొత్త తాండాలో జరిగిన విద్యుత్ ప్రమాద సంఘటనపై పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డిలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. జరిగిన ఈ సంఘటనపై వారు స్పందిస్తూ క్షేత్ర స్థాయిలో క్షణ్ణంగా విచారణ జరిపి అందుకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో వారు వెల్లడించారు. ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం ఒప్పంద కార్మికులతో విద్యుత్ బకాయిల వసూళ్ళ, ఇతర శాఖాపరమైన పనులు మాత్రమే చేయించాలని ప్రభుత్వం నుండి స్పష్టమై నిబంధనలు ఉన్నాయన్నారు. అలాంటప్పుడు ప్రమాదాలు జరిగే పనులకు వీరిని ఎలా పురామాయిస్తారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.

## దొమ్మి కేసులో 14 మంది రిమాండ్‌కు




నిందితులను అరెస్ట్ చేసిన దృశ్యం

**యాడికి, ఆగస్టు 17 ప్రభాతవార్త**
మండలంలోని బోయరెడ్డిపల్లి గ్రామంలో దొమ్మి కేసులో 14 మందిని శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ నాగార్జునరెడ్డి తెలిపారు. డిఎస్‌పి జనార్ధన్‌నాయుడు ఆదేశాల మేరకు కర్రలతో కొట్టి, రాళ్ళు విసిరి గాయపరచగా ముద్దాయిలను చిక్కేపల్లి గ్రామ బస్టాండ్ వద్ద అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ తెలిపారు. ప్రసాద్, గురుమోహన్, ఓబులేసు, పుట్లూరు ఓబులేసు, లక్ష్మీనారాయణ, హరికృష్ణ, పవన్‌కుమార్, మారుతికుమార్, రామచంద్ర, నారాయణస్వామి, చింతకాయల పెద్దయ్య, చింతకాయల రామచంద్ర, బాలగుర్రప్ప, బాలన్నలను రిమాండ్‌కు తరలించినట్లు సిఐ తెలిపారు.

## భారీ వర్షానికి పొంగి పొర్లిన వాగులు, వంకలు..!

**-పలుచోట్ల వరద ఉద్ధృతికి రాకపోకలకు అంతరాయం**

ఉరవకొండ, ఆగస్టు 17 ప్రభాతవార్త



బూదగవి చెరువు నిండి మరువ పారుతున్న దృశ్యం

ఉరవకొండ ప్రాంతంలో శుక్రవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షం 65.8 మిల్లీ మీటర్లుగా నమోదు కాగా వాగులు, వంకలు పొంగి పొర్లాయి. బూదగవి చెరువు పూర్తిగా నిండి మరువ పారింది. నింబగల్లు గ్రామ సమీపంలోని హెచ్ఎల్సీ కాలువవద్ద ప్రధాన రోడ్డుపై వరద పారడంతో అర్ధరాత్రి మొదలు ఉదయం 11 గంటల సమయం వరకు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడగా ప్రయాణీకులు ఇబ్బందులు పడ్డారు. ఆగస్టు నెల ఆరంభం నుండి ఇప్పటివరకు ఉరవకొండ ప్రాంతంలో భారీ వర్షాల జాడే లేకపోగా శుక్రవారం మధ్యాన్నం, అర్ధరాత్రి కురిసిన వర్షాలతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడగా ఎండ తీవ్రత, ఉక్కపోతతో సతమతమైన ప్రజలు ఊరిపి పీల్చుకున్నారు. భారీ వర్షాలు ప్రస్తుతం సాగులో ఉన్న కంది, వేరుశెనగ తదితర పంటలకు ఎంతో మేలు చేశాయని రైతులు చెబుతున్నారు.

## కన్నుల పండువగా సంజప్పతాత బ్రహ్మ రథోత్సవం

ఉరవకొండ, ఆగస్టు 17 ప్రభాతవార్త



భక్తజన సందోహం మధ్య కొనసాగుతున్న సంజప్పతాత రథోత్సవం



ఉత్సవంలో పాల్గొన్న గవిమఠం ఉత్తరాధికారి డాక్టరు కరిబసవరాజేంద్ర మహాస్వామి

మండల పరిధిలోని మోపిడి గ్రామంలో వెలసిన సంజప్పతాత బ్రహ్మరథోత్సవం స్వస్తిశ్రీ క్రోధినామ సంవత్సరం శ్రావణ శుద్ధ త్రయోదశి శనివారం సాయంత్రం కన్నుల పండువగా జరిగింది. గవిమఠం ఉత్తరాధికారి డాక్టరు కరిబసవరాజేంద్ర మహాస్వామి ముఖ్య అతిధిగా హాజరుకాగా తొలుత సంజప్పతాత ఆలయంతోపాటు రథం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి రథాన్ని లాగారు. దీంతో భక్తులు రథంపై అరటిపండ్లు, చీనీకాయలు విసిరి తమ భక్తిప్రవర్తలను చాటుకున్నారు. ఉదయం సుప్రభాతం మొదలు గణపతి, నవగ్రహ పూజలు, కలశస్థాపన అనంతరం సంజప్పతాత విగ్రహానికి పంచామృతాభిషేకం, మడుగుతేరు జరుగగా మధ్యాన్నం నుండి అన్నదాన కార్యక్రమం కొనసాగింది. మోపిడి గ్రామం నుండే కాకుండా చుట్టుప్రక్కల గ్రామాల నుండి కూడా భక్తులు రదజోత్సవ కార్యక్రమంలో పెద్దఎత్తున పాల్గొన్నారు.

## ఉరవకొండ ఏఎస్‌డబ్ల్యూఓ కె.రాంమోహన్‌కు ఉత్తమ సేవా అవార్డు

ఉరవకొండ, ఆగస్టు 17 ప్రభాతవార్త



అవార్డు అందుకొంటున్న ఏఎస్‌డబ్ల్యూఓ కె.రాంమోహన్

ఉరవకొండ ఏఎస్‌డబ్ల్యూఓ కె.రాంమోహన్ ఉత్తమ సేవా అవార్డు అందుకున్నారు. ఈనెల 16వ తేదీన జిల్లా కేంద్రం అనంతపురంలోని పోలీస్ పరేడ్ మైదానంలో వైభవంగా జరిగిన 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఏఎస్‌డబ్ల్యూఓ కె.రాంమోహన్‌కు రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఏఎస్‌డబ్ల్యూఓ కె.రాంమోహన్ మాట్లాడుతూ అవార్డు రావడం సంతోషకరమని తనపై మరింత బాధ్యత పెరిగిందని అన్నారు.

## టీబీ డ్యాం తాత్కాలిక గేట్ అమర్చడానికి మంత్రి పయ్యావుల కేశవ్ కృషి అమోఘం

ఉరవకొండ, ఆగస్టు 17 ప్రభాతవార్త

ఈనెల 10 తేదీన వరద ఉద్ధృతికి కొట్టుకుపోయిన తుంగభద్ర జలాశయం 19వ క్రస్టు గేట్ స్థానంలో తాత్కాలిక గేట్ అమర్చడానికి రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ చేస్తున్న కృషి అమోఘమని జై కిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగమల్లి ఓబులేష్ అన్నారు. శనివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ గేట్ కొట్టుకుపోయిందని తెలియగానే లక్షలాది మంది ఆయకట్టు రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారని ఆ సమయంలో రంగంలోకి దిగిన మంత్రి డ్యాం నీరు వృధా కాకుండా కాపాడుకొంటూనే తాత్కాలిక గేటు బిగించడానికిగల సాధ్యాసాధ్యాలపై ఇంజనీరింగ్ నిపుణుడు, విశ్రాంత ఇంజనీరు కన్నయ్యనాయుడుతో సంప్రదింపులు జరిపి ఆయన సలహాలు, సూచనలతో యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టి అసాధ్యాన్ని సుసాధ్యం చేసి చూపిస్తున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌తోపాటు జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఇంజనీరింగ్ నిపుణుడు కన్నయ్య నాయుడుకు రైతుల తరుపున కృతజ్ఞతలు తెలియజేశారు.

## ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా పంచాయతీ చర్యలు

**-తోపుడు బండ్లు, ఆకుకూరల వ్యాపారుల నియంత్రణ**

ఉరవకొండ, ఆగస్టు 17 ప్రభాతవార్త



తోపుడు బండిను పక్కకు జరుగాలని సూచిస్తున్న పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుడు

పట్టణంలోని ట్రాఫిక్ సమస్యను అరికట్టడానికి మేజర్ గ్రామ పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు. స్థానిక క్లాక్‌టవర్ కూడళి, కవితా హోటల్ సర్కిల్, గుంతకల్లు రోడ్లలో తోపుడు బండ్లు, ఆకుకూరల వ్యాపారులు తమ తోపుడు బండ్లను ప్రధాన రోడ్లపై మధ్యలో నిలపి వ్యాపారాలు చేసుకొంటుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రజల నుండి వచ్చిన పిర్యాదులపై పంచాయతీ కార్యదర్శి ఎ.గౌస్‌సాహెబ్ స్పందించారు. పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులను మూడు ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ అంతరాయం నియంత్రించే బాధ్యతలను అప్పగించారు. ఏ ఒక్క తోపుడు బండి ఇష్టారాజ్యంగా రోడ్డు మధ్యలో వచ్చి వ్యాపారం చేసుకోకుండా వారు నిలువరిస్తున్నారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి ఎ.గౌస్‌సాహెబ్ మాట్లాడుతూ ఇకపై ప్రతిరోజూ ఉదయం 9గంటలనుండి సాయంత్రం 5గంటలవరకు పంచాయతీ కార్మికులు ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రధాన కూడళ్లలో పనిచేస్తారని పాదచారులు, వాహనదారులకు ఇబ్బందులులేకుండా చూస్తామని తెలిపారు.

## వైభవంగా శ్రీవారి ప్రాకారోత్సవం



శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనరసింహుని ప్రాకారోత్సవం దృశ్యం

ఉరవకొండ, ఆగస్టు 17 ప్రభాతవార్త

మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిళంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వస్తిశ్రీ క్రోధినామ సంవత్సరం శ్రావణ శుద్ధ త్రయోదశి శనివారం సాయంత్రం లక్ష్మీనరసింహుని ప్రాకారోత్సవం వైభవంగా, కన్నుల పండువగా జరిగింది. ఆలయ కార్యనిర్వహణ అధికారి కె.విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత నృసింహస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి శోభాయమానంగా తీర్చిదిద్దిన పల్లకీలో కొలువుదీరి చ్గా ప్రధానాలయం చుట్టూ ప్రదక్షిణ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండే కాకుండా కర్నాటక ప్రాంతం నుండి కూడా భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి శ్రీవారిని దర్శించుకొని ప్రత్యేక ఆకు పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. క్షేత్రం గుండా గలగలపారే నీటి జలపాతాలను తిలకించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా సంక్షిప్త సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం

**-బీఎల్ఓలతో సమావేశంలో తహశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషా**

ఉరవకొండ, ఆగస్టు 17 ప్రభాతవార్త



బీఎల్ఓలతో సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషా

ఈనెల 20వ తేదీ నుండి వచ్చే ఏడాది జనవరి 6వ తేదీ వరకు జరిగే ఓటరు జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమం-2025 కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని తహశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషా అన్నారు. పట్టణంలోని స్థానిక మండల తహశీల్దార్ కార్యాలయంలో శనివారం మధ్యాన్నం ఆయన బీఎల్ఓలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషా మాట్లాడుతూ ఈనెల 20 నుండి అక్టోబర్ 18 వరకు బీఎల్ఓలు ఇంటింటికి వెళ్లి సవరణ ప్రక్రియ చేపట్టాల్సి ఉంటుందన్నారు. అక్టోబర్ 29 నుండి ఓటు నమోదుకు దరఖాస్తులను స్వీకరణ చేపట్టాలన్నారు. 2025 జనవరి 1 నాటికి 18 సంవత్సరాల వయసు నిండబోయే ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అక్టోబర్ 29 ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల జరుగుతుందని అదే రోజు నుంచి నవంబర్ 28 వరకు క్లైములు, అభ్యంతరాల స్వీకరించాల్సి ఉంటుందన్నారు. డిసెంబర్ 24 నాటికి క్లైములు, అభ్యంతరాల పరిష్కారం జరుగాలని, 2025 జనవరి 6న ఓటర్ల తుది జాబితా ప్రచురించడం జరుగుతుందన్నారు. నవంబర్ 9, 10, 23, 24 శని, ఆదివారాల్లో జరిగే ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించాల్సి ఉంటుందని ఆయా రోజుల్లో బీఎల్ఓలు పోలింగ్ బూత్‌లలో ప్రజలకు అందుబాటులో ఉండాలని తహశీల్దార్ సూచించారు. ఈ సమావేశంలో ఎన్నికల విభాగం డిప్యూటీ తహశీల్దార్ జి.మునీంద్ర, సీనియర్ సహాయకులు ఎం.బి.సాయిక్రిష్ణ వంశీ, సూపర్‌వైజర్లు, బీఎల్ఓలు పాల్గొన్నారు.

## స్కిల్ హబ్ కోర్సులకు ఇన్‌స్ట్రక్టర్లుగా పనిచేయడానికి ఆహ్వానం

**-ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కె.అశ్రఫ్ అలీ**

ఉరవకొండ, ఆగస్టు 17 ప్రభాతవార్త

మండల పరిధిలోని చిన్నముష్టూరు గ్రామంలోగల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో త్వరలో ప్రారంభమవుతున్న స్కిల్ హబ్ కోర్సులకు ఇన్‌స్ట్రక్టర్లు (ట్రైనర్లు)గా పనిచేయడానికి అర్హతలు కలిగినవారు ఈనెల 19న సోమవారం ఉదయం 11 గంటలకు విద్యార్హత సర్టిఫికేట్లతో కళాశాలలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ కె.అశ్రఫ్ అలీ తెలిపారు. శనివారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సు ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు ఎంఎస్సీ, బీఎస్సీతోపాటు కంపూటర్స్, ఎంకామ్, బీకామ్‌తోపాటు కంప్యూటర్స్, ఎంటెక్, బీటెక్ చదివిన వారు, సర్వేయర్ కోర్సులకు బీటెక్, డిప్లొమో ఇన్ సివిల్ ఇంజనీరింగ్, ఐటీఐతోపాటు డ్రాఫ్ట్‌మెన్ సివిల్ పూర్తీ చేసిన వారు అర్హులన్నారు. నిరుద్యోగులకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని ఇన్‌స్ట్రక్టర్లకు నెలకు దాదాపు 15,000 రూపాయలు గౌరవ వేతనాన్ని విద్యార్థుల సంఖ్యను బట్టి ఇవ్వడం జరుగుతుందని ప్రిన్సిపాల్ వివరించారు.

## నాక్ బృందం పర్యటనలో పూర్వ విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి పాల్గొనండి

**-ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా॥జి.రామకృష్ణ**

ఉరవకొండ, ఆగస్టు 17 ప్రభాతవార్త



విలేఖరులతో మాట్లాడుతున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా॥జి.రామకృష్ణ

ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన, కళాశాల అభివృద్ధిని కాంక్షించే పూర్వ విద్యార్థులు ఈనెల 19వ తేదీన మధ్యాన్నం 2 గంటలకు తమ తల్లిదండ్రులతో కలిసి కళాశాలకు రావాలని కళాశాల ప్రిన్సిపాల్ డా॥జి.రామకృష్ణ పిలుపునిచ్చారు. శనివారం ఆయన స్థానిక విలేఖరులతో మాట్లాడారు. కళాశాల గ్రేడ్‌ను నిర్ణయించడానికి గాను ముగ్గురు నిపుణుల కమిటీ నాక్ (నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్) బృందం ఈనెల 19, 20 తేదీల్లో కళాశాలను సందర్శిస్తుందన్నారు. ఈ సందర్భంగా నాక్ బృందం కళాశాల పూర్వ విద్యార్థులతో చర్చించడం జరుగుతుందన్నారు. పూర్వ విద్యార్థులు తప్పక హాజరై కళాశాల అభివృద్ధికి అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాలని ప్రిన్సిపాల్ కోరారు.

## విధులు బహిష్కరించి రోడ్డెక్కిన డాక్టర్లు....

కణేకల్లు, ఆగస్టు 17 ప్రభాతవార్త:



నిరసన తెలుపుత్ను వైద్యులు...

కోల్‌కత్తాలోని మెడికల్ కాలేజీలో ట్రైనీ డాక్టర్ పై అత్యాచారం చేసి హత్యకు గురి అయిన సందర్భంగా దేశ వ్యాప్తంగా డాక్టర్లు నిరసన తెలిపారు. ఇందులో భాగంగానే కణేకల్లు మండల ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు పెద్దఎత్తున తమ విధులను బహిష్కరించి శనివారం పెద్దఎత్తున నిరసనతెలిపారు. విధులు బహిష్కరించిన డాక్టర్లు ప్రభుత్వ ఆసుపత్రి నుండి ఆర్టీసి బస్టాండ్ వరకు ర్యాలీగా వస్తూ హంతకులను కఠినంగా శిక్షించాలని, ప్రాణాలను పోసే డాక్టర్లకే రక్షణ కరువైందని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రశేఖర్ నాయక్ మాట్లాడుతూ కోల్‌కత్తాలో ట్రైనీ డాక్టర్‌పై అగంతకులు చేసిన దారుణాన్ని సభ్యసమాజం తలదించుకునేలా ఉందన్నారు. ప్రాణంపోసే డాక్టర్లకి ప్రాణాపాయం ఉంటుందంటే ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాలేదన్నారు. చట్టాలు చాలా ప్రతిష్టంగా ఉన్నప్పుడే ఇలాంటివి పునరావృతం కాకుండా ఉంటాయన్నారు. గుప్పెడు ఆశలతో సమాజానికి ఏదో సేవ చేయాలని కృత నిశ్చయంతో వచ్చిన డాక్టర్లను కొందరు మూర్ఖులు మానవ మృగాలు చేసిన పనికి ఆమె భవిష్యత్తు గాక వారి కుటుంబం కూడా రోడ్డున పడిందన్నారు. దీనిపై సిబిఐవిచారణచేపట్టా దోషులను నడిరోడ్డుమీద కఠినంగా శిక్షించినప్పుడే మునుముందు ఇలాంటివి పునరావృతం కాకుండా ఉంటాయన్నారు. అక్కడ ఇక్కడచూస్తూ ఉంటామని, డాక్టర్లపై జరుగుతున్న దాడులను వసులు తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలంటే వారికి తగిన రక్షణ భద్రత కావాలన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో డాక్టర్ పావని, జయ మహేంద్ర, షరీఫ్, హర్షవర్ధన్, ప్రవీణ్, నిరీష్, అబ్దుసు, సలాం, సిబ్బంది పాల్గొన్నారు.

## వైద్య విద్యార్థిని హత్యాచార బాధ్యులను కఠినంగా శిక్షించాలి

**-ఉరవకొండలో ప్రభుత్వ వైద్యులు, వైద్య సిబ్బంది డిమాండ్**

**-ఓపీ వైద్య సేవలు బహిష్కరించి నల్లబ్యాడ్జీలతో నిరసన ర్యాలీ**

ఉరవకొండ, ఆగస్టు 17 ప్రభాతవార్త




ఉరవకొండలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రి ముందు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న డాక్టర్లు, సిబ్బంది

కోల్‌కతాలోని ఆర్.జి.కార్ వైద్య కళాశాలలో వైద్య విద్యార్థినిపై జరిగిన అమానుష అత్యాచార ం, హత్య బాధ్యులను కఠినంగా శిక్షించాలని వైద్యులు, వైద్య సిబ్బంది డిమాండ్ చేశారు. హత్యాచారాన్ని నిరసిస్తూ శనివారం నియోజకవర్గ కేంద్రమైన ఉరవకొండ పట్టణంలోని 50 పడకల ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రి వద్ద నుండి వైద్యులు, వైద్య సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి ప్లకార్డులు చేతబట్టి క్లాక్‌టవర్ కూడళి వరకు నిరసన



పట్టణంలో కొనసాగిన నిరసన ర్యాలీ

ప్రదర్శన నిర్వహించారు. అత్యవసర సేవలు మినహా ఉదయం 9 గంటల నుండి 11గంటలవరకు ఓపీ వైద్యసేవలను బహిష్కరించారు. ఈ సందర్భంగా వైద్యులు, వైద్య సిబ్బంది మాట్లాడుతూ వైద్య విద్యార్థిని హత్యాచార ఘటన బాధ్యులను కఠినంగా శిక్షించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ కమ్యూనిటీ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ గంగాధర్, డాక్టర్ అర్జున్, డాక్టర్ సాక్షి, డాక్టర్ సాహితి, డాక్టర్ వినీత, డాక్టర్ కుముద, రాకెట్ల పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ వెంకటేష్‌నాయక్, ఏపీ హంస కార్యదర్శి నిమ్మల వెంకటేష్, నాయకులు రాఘవేంద్ర, నర్సులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళా వైద్యురాలిపై అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

**-ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ**

**-స్వచ్ఛంధంగా ప్రైవేటు ఆసుపత్రులు బంద్**

గుంతకల్లు, ఆగస్టు 17 ప్రభాతవార్త



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కలకత్తాలో విధి నిర్వహణలో వున్న ట్రైనీ మహిళా వైద్యురాలిపై అత్యాచారానికి పాల్పడి న నిందితులను కఠినం గా శిక్షించాలని ఇండి యన్ మెడికల్ అసోసి యేషన్ పట్టణశాఖ ఆధ్వర్యంలో శనివారం పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వాసుపత్రి నుండి గాంధీచౌక్ వరకు ర్యాలీ సాగింది. అనంతరం అసోసియేషన్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ కీర్తికిరణ్‌రెడ్డి, డాక్టర్ ఎకె జిలానీలు మాట్లాడుతూ మహిళా వైద్యురాలిపై అత్యాచారం జరగడం బాధాకరమన్నారు. విధి నిర్వహణలో వున్న వైద్యురాలిపై ఇలాంటి అమానుష ఘటన జరగడం దురదృష్టకరమన్నారు. వైద్యులపై దాడులు జరగకుండా ప్రత్యేక చట్టాలను తీసుకవాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రధానంగా ప్రభుత్వాపత్రుల్లో విధులు నిర్వహిస్తున్న మహిళా డాక్టర్లకు ప్రత్యేక రక్షణ కల్పించాలని వారు పేర్కొన్నారు. బాధితు రాలి కుటుంబసభ్యులను ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకోవాలని వారు కోరారు. ర్యాలీకి వామపక్షపార్టీలు, ప్రజాసంఘాలు మద్దతు తెలిపాయి. దాడి ఘటనను ఖండిస్తూ పట్టణంలోని అన్ని ప్రైవేటు ఆసుపత్రుల వారు స్వచ్ఛంధంగా బంద్ పాటించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు శ్రీనివాసగుప్తా, సాయిప్రసాద్, సరోజమ్మ, కమలమ్మ, జయవర్ధన్‌రెడ్డి, విక్రమ్, రామాంజినేయులు, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

## వైద్యులకు ప్రత్యేక చట్టం ద్వారా రక్షణ కల్పించాలి

కొత్తచెరువు, ఆగస్టు 17, ప్రభాతవార్త



నాలుగురోడ్ల కూడలిలో నిరసన తెలియజేస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది

వైద్యుల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకువచ్చి రక్షణ కల్పించాలని పలువురు వైద్యులు డిమాండ్ చేశారు. ఇటీవల కోల్‌కతాలో వైద్యురాలి హత్యాచార సంఘటనను నిరశిస్తూ శనివారం మండల కేంద్రమైన కొత్తచెరువులోని నాలుగురోడ్ల కూడలిలో నిరసన తెలియజేశారు. తొలుత కొత్తచెరువు సిహెచ్‌సి కేంద్రం నుండి ర్యాలీగా నాలుగురోడ్ల కూడలికి చేరుకొని నెహ్రూ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ, ప్రాణం పోసే డాక్టర్ అని కూడా చూడకుండా అత్యంత కిరాతకంగా దురాగతానికి పాల్పడడం పట్ల తీవ్రంగా ఖండించారు. నిందితులకు వెంటనే కఠిన శిక్ష విధించాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇందుకు నిరసనగా దేశం వ్యాప్తంగా డాక్టర్లు, జూనియర్ డాక్టర్లు వైద్యసిబ్బంది శనివారం ఉదయం నుండి చేపట్టిన 24 గంటల నిరసన దీక్షను అభినందిస్తూ తమ సంపూర్ణ మద్దతు తెలియజేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతంకాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఆంజనేయస్వామికి విశేషపూజలు



ఆంజనేయస్వామికి పూజలు నిర్వహించిన దృశ్యం

అమరాపురం, ఆగస్టు 17 ప్రభాతవార్త

గుడిబండ మండలం పిసి గిరి ఆంజనేయస్వామి సన్నిధిలో అభిషేకాలు, పూజల్లో మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎంఎల్‌సి గుండుమల తిప్పేస్వామి పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి, మండల కన్వీనర్ మద్దనకుంటప్ప, జిల్లా ఎస్‌సి సెల్ అధ్యక్షులు మంజునాథ్, జిల్లా లింగాయత్ అధ్యక్షులు దుర్గేష్, కార్యదర్శి ప్రకాష్, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు లక్ష్మీనరసప్ప, జయరామప్ప, టిడిపి, బిజెపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

## ఆర్‌అండ్‌బి రోడ్డును మీ నాయకులు ఆక్రమించుకున్నారు స్వాధీనం చేసుకోండి

**- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి**



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే

అమరాపురం, ఆగస్టు 17 ప్రభాతవార్త

మండలంలోని ఉదగూరు గ్రామం వద్ద వైకాపా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి పొలంకు ఏర్పాటు చేసిన ప్రహరీగోడ ఆర్‌అండ్‌బి రోడ్డులో వుందని తక్షణం దీన్ని తొలగించాలని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అధికారులను ఆదేశించడంపైన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి మాట్లాడుతూ బ్రిటీష్ కాలం నుండి ఉన్న బెంగుళూరు నుండి బళ్లారికి వెళ్లే 60 అడుగుల రోడ్డు తెలుగుదేశం పార్టీ నాయకులు ముగ్గురు ఆక్రమించుకున్నట్లు దాన్ని స్వాధీనం చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే పేర్కొన్నారు. ముఖ్యంగా తన సొంత పొలం నుండి గ్రామానికి ప్రజలు వెళ్లేందుకు దారిని కూడా విడిచారని ఆయన పేర్కొన్నారు. అయితే తక్షణం అధికారులు తొలగించకపోతే నేనే వచ్చి తొలగిస్తానని ఎమ్మెల్యే పేర్కొనడం హాస్యాస్పదంగా వుందన్నారు. ముఖ్యంగా తనకు నోటీసు ఇవ్వకుండా దీనికి సంబంధించిన ఆర్‌అండ్‌బి గాని రెవెన్యూ గ్రామ పంచాయతీ తదితర అధికారులు వచ్చి చట్టపరంగా రోడ్డు పరిధిలో వస్తే వదలడానికి సిద్ధమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా మండల కన్వీనర్ త్రిలోక్నాథ్, నాయకులు ఆటో తిప్పయ్య, రాజు, శివలింగప్ప, పేలుబండ ప్రసాద్, నారాయణప్ప, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీశనీశ్వరస్వామి వేడుకలు



శ్రీశనీశ్వరస్వామి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

అగళి, ఆగస్టు 17 ప్రభాతవార్త

మండల కేంద్రమైన అగళి శ్రీశనీశ్వరస్వామితో పాటు తోటదాఈశ్వరా స్వామి, ఆంజనేయస్వామి, గణపతి, అయ్యప్పస్వామి, సుబ్రమణ్యస్వామి, సీతారామాంజనేయస్వామి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. స్వామివారి మూలవిరాట్లకు వివిధ రకాల పూలతో మామిడి అరటితోరణాలతో అలంకరించారు. శనివారం శని మహాత్మునికి ప్రీతికరమైన రోజు కావునా ఈ రోజు స్వామి పూజలో పాల్గొంటే అంతా మంచి జరుగుతుందని భక్తుల విశ్వాసం. తోటదా అప్పస్వామి పూజను పూజారి చానా నిష్టతో చేశారు. తోటదాఅప్పస్వామిని కొబ్బరి నీళ్లతో కట్టారని చరిత్ర చెబుతుంది. ఆంజనేయ స్వామి, సీతారామాంజనేయస్వామి పూజలను ఘనంగా నిర్వహించారు. మహామంగళహారతి, అభిషేకం, తదితర పూజలు నిర్వహించారు. అనంతరం పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఉమేష్, తదితరులు పాల్గొన్నారు.

## బళ్లారిలో శోషిత సముదాయాల సమాఖ్య కార్యకర్తల ప్రతిఘటన

బళ్లారి, ఆగస్టు17, ప్రభాతవార్త;

వివాదం కాని కేసులో ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై ప్రాసిక్యూషన్ జరిపేందుకు అనుమతినిచ్చిందున గవర్నర్ తావర్ చంద్ గెహ్లాట్ పక్షపాత ధోరనిని ఖండిస్తూ రాష్ట్ర శోషిత సముదాయాల సమాఖ్య ల్లో అధ్యక్షుడు డా.గాదిలింగన గౌడ ఆరోపించారు. స్థానిక రాయలసర్కిల్‌లో జరిగిన ప్రతిఘటనకు నేతృత్వం వహించి మాట్లాడారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై రాష్ట్ర గవర్నర్ ఇచ్చిన ప్రాసిక్యూషన్ అనుమతిని బేషరతుగా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతిఘటనలో పాల్గొన్న లిడ్కర్ అధ్యక్షుడు ముండ్రగి నాగరాజ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఎటువంటి కలంకం లేని నాయకుడిగా ఉన్నారని, ఉత్తమ సీఎంగా రాష్ట్రంలో చక్కటి పాలన అందిస్తున్న తమ నాయకుడిని చేసి బీజేపీ వారు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నేతలతో కలిసి సీఎంపై లేనిపోని అంబాడాలు మోపుతున్నారని, ఎటువంటి పరిస్థితుల్లో సీఎం రాజీనామా చేసేదిలేదని, ఇది బీజేపీ వారు గమనించాలని సవాల్ విసిరారు. రాష్ట్ర గవర్నర్ చర్య ఖండనీయమని తెలిపిన ఆయన తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ నేతృత్వంలో శోషిత సముదాయాల ప్రజలు తీవ్రస్థాయిలో పోరాటం జరుపుతారని హెచ్చరించారు. ఈ ప్రతిఘటనలో డీఎస్ఎస్ రాజ్య సంచాలకుడు ఎ.మానయ్య, జిల్లా వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడు హుమయూన్‌కాన్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కల్లుకంబ పంపాపతి, అరుణ్‌కుమార్, వెంకటేష్ హెగడే, కుడితిని రామంజిని, పి.జగన్నాథ్, బి.ఆర్.ఎస్. శీన, హొన్నప్ప, కెరె కోడెప్ప, పాలికె సభ్యుడు నూర్ మహ్మద్, మించు శ్రీనివాస్, సరగు నాగరాజ్ సంగనకల్ విజయ్‌కుమార్, బెణకల్ బసవరాజుగౌడ, బి.ఎం పాటిల్, మంజుల, శాంతమ్మ, ఎల్.మారెన్న, ఎరుకల స్వామి తదితర వందలాది మంది కాంగ్రెస్ నాయకులు, శోషిత సముదాయాల పదాధికారులు పాల్గొన్నారు.



ప్రతిఘటన చేస్తున్న శోషిత సముదాయాల సమాఖ్య కార్యకర్తలు

